నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 2 నవంబర్ 2024 | SANGAREDDY

ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే నీళ్ల పాలు..

నేను పది రోజుల కిందటే ఫైజాబాద్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చిన. తొందర్నే కొంటరని సంబురపడ్డ. కానీ, కొన లేదు. ఏవేవో కారణాలు చెప్పుతున్నరు. పదేండ్లల్ల ఇలా ఎప్పుడూ జరుగలే. వెంట వెంటనే ధాన్యం కొన్నరు. పైసలు ఇచ్చిండ్రు. ఇప్పుడున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మాకు ఈ కష్టం వచ్చింది. ధాన్యం మొత్తం తడిసింది. తడిసిన ధాన్నాన్ని ప్రభుత్వం కొనాలి.

-గోపాల్‌రావు, రైతు, ఫైజాబాద్(మెదక్ జిల్లా)

వడ్లు మొత్తం కొట్టుకుపోయాయి..

రాత్రిపూట వాన రావడంతో ధాన్యం మొత్తం కొట్టుకుపోయింది.నాకు తీవ్రంగా నష్టం జరిగింది. చేతికొచ్చిన ధాన్యం తూకం వేసే సమయంలో తడిసింది. నన్ను ప్రభుత్వమే ఆదుకోవాలి. అప్పు చేసి వరి ఏసిన. వడ్లు వాననీళ్లలో కొట్టుకు పోయాయి. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.కనీసం రైతు బంధు వస్తే నైనా బాగుండు. అదిగూడా రాలేదు.

-గొల్లరాజు,రైతు, రామాయంపేట

కొనుగోళ్లేవి..!

సెంటర్లు ప్రారంభించి ధాన్యం కొనడం మరిచిన సర్కారు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1008 కొనుగోలు కేంద్రాలు

ఇంకా పూర్తికాని మిల్లుల అలాట్‌మెంట్

- 20 రోజులు దాటినా కొన్ని సెంటర్లలో ఇంకా కొనని ధాన్యం
- సరిపడా లేని గన్నీ బ్యాగులు
- దడ పుట్టిస్తున్న వర్షం.. ఆందోళనలో రైతులు
- వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- రాష్ట్రప్రభుత్వ తీరుపై మండిపాటు

చిన్నశంకరంపేట అంబాజిపేట కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యపురాశులు

సిద్దిపేట, నవంబర్ 01(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వానకాలం ధాన్యం సేకరణపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. పేరుకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నా, ధాన్యం మాత్రం సేకరించడం లేదు. రైతులు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులు దాటుతున్నా సెంటర్లలో ధాన్యం కొనడం లేదు. గన్నీ బ్యాగులు లేక, మిల్లుల అలాట్‌మెంట్ కాక, ఇతరత్రా సమస్యలతో ధాన్యం కొనలేక పోతున్నామని సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పలుచోట్ల దీపావళి పండుగ పూట వర్షం కురవడంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు కంటనీరు పెట్టారు. సిద్దిపేట జిల్లాలో 3,68,000 ఎకరాల్లో వరిసాగు కాగా, 8 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో నుంచి 4 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మెదక్ జిల్లాలో 2.97 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సంగారెడ్డి జిల్లాలో 1,08,415 ఎకరాల్లో వరి సాగు చేయగా, 2.32 లక్షల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. 2 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, లక్ష్యానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయలేదు. ప్రభుత్వ నిర్ణయం అసమగ్రంగా ఉండడంతో ఈసారి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. క్వింటాల్‌కు రైతులు రూ. 300 నుంచి రూ. 400 వరకు నష్టం జరుగుతున్నది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను నిర్ణీత కాలంలో నడపకపోవడం మూలంగా రైతులు వ్యాపారులను ఆశ్రయించి ధాన్యం అమ్ముకుంటున్నారు. సన్న రకానికి రూ.500 బోనస్ ఇవ్వడం దేవుడెరుగు, అసలు ధాన్యమే కొనడం లేదని రైతులు వాపోతున్నారు. కేంద్రాలు కొనుగోళ్లు ఎంత ఆలస్యమైతే అంత ధాన్యం బహిరంగ మార్కెట్‌లో వ్యాపారుల చేతిలోకి పోతుందని ప్రభుత్వ భావనగా ఉంది. అందుకే ఆలస్యం చేస్తున్నదని రైతులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ఒకవేళ ధాన్యం కొన్నా డబ్బులు సకాలంలో వేస్తారో లేదో అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రేటు తక్కువైనా వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

20 రోజులైన కొనని ధాన్యం..

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులు దాటినా ఇంత వరకు ధాన్యం కొనడం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవలే ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మిల్లు అలాట్‌మెంట్ కాలేదని కుంటి సాకులు చెబుతూ ధాన్యం కొనడం లేదని రైతులు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. చాలాచోట్ల ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు అక్కడనే పడిగాపులు కాస్తున్నారు. పేరుకు మాత్రమే ఇన్ని కేంద్రాలను ప్రారంభించామని చెబుతున్నారు తప్పా... క్షేత్రస్థాయిలో పూర్తి విరుద్ధంగా ఉంది. ఒక్క సిద్దిపేట జిల్లాలోనే 140 మిల్లులకు సీఎంఆర్ కోసం ఎంపిక చేస్తున్నట్లు సమాచారం. ఇది అయ్యేది ఎప్పుడు, ఆయా కేంద్రాలకు మిల్లులు అలాట్‌మెంట్ అయ్యేది ఎన్నడూ, తమ ధాన్యం అమ్ముడు పోయేది ఎప్పుడు అంటూ రైతులు ప్రభుత్వ తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్‌కు రూ. 2320, బి-గ్రేడుకు రూ. 2300 నిర్ణయించింది. సన్నరకం వడ్లకు రూ. 500 బోనస్ అదనంగా ఇస్తామని చెప్పింది. ప్రభుత్వం మీద నమ్మకం లేకనో..లేదా మరోటి కారణం కావచ్చు మొత్తంగా రైతులు వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇప్పటి వరకు వ్యాపారులే ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశారు.తేమ తదితర వాటికి కొంత కోత పెట్టుకొని వ్యాపారులు క్వింటాలు ధాన్యానికి రూ. 1900 నుంచి రూ. 2100 వరకు కొనుగోలు చేసి 15 రోజుల్లో డబ్బులు చెల్లిస్తున్నట్లు తెలిసింది.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కడ చూసినా ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో 417, మెదక్ జిల్లాలో 380, సంగారెడ్డి జిల్లాలో 211 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలు, ఫ్యాక్స్, మార్కెట్‌ల ద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సెంటర్ల సంఖ్య బాగానే ఉంది. కానీ, వీటిలో 20 శాతం కేంద్రాల్లో కూడా ధాన్యం సేకరణ జరగడం లేదు. పేరుకు సెంటర్లలో కనీస సౌకర్యాలు లేవు. తేమ శాతం మిషన్, జల్లి, టార్పాలిన్, దొడ్డు, సన్న రకం వడ్లను గుర్తించడానికి కావాల్సిన మిషన్లు ఇంత వరకు రాలేదు. గన్నీ బ్యాగులు సిద్ధంగా లేవు, మిల్లుల అలాట్‌మెంట్ పూర్తికాలేదు. ఇవన్నీ చేయకుండానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించిన తర్వాతనే ధాన్యం కొనుగోలు చేసేశారు. ధాన్యం కొన్న 72 గంటల్లోనే రైతుల ఖాతాలో నేరుగా డబ్బులను వేసేవారు, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితి లేదు.

> **దడ పుట్టిస్తున్న మబ్బులు**
>
> వచ్చిపోయే మబ్బులతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఎప్పుడు ఎక్కడి నుంచి వాన వస్తుందో..ధాన్యం తడిసిపోతుందనే బెంగ రైతులను వెంటాడుతున్నది. పొద్దుగాళ్ల ఎండ పగటిల్లా మబ్బులు, సాయంత్రం ఎండ, ఇలా రావడంతో రైతు లు ధాన్యం అరబెట్టడం, దగ్గర పోయడం దీనికే సరిపోతున్నది. ఒకవేళ అలానే ఉంచుదాం అంటే వర్షం వచ్చి ధాన్యం అంతా తడుస్తుందనే భయం. ధాన్యం ఆరబోయకపోతే బూజు వస్తుంది. దీంతో రోడ్లపైనే ధాన్యం అరబెడుతూ అక్కడే రైతులు గడుపుతున్నారు.

చిలిపిచెడ్ : అజ్జమర్రిలో భారీ వర్షంకు తడిసి ముద్దైన వరి ధాన్యం

నిజాంపేట : నస్కల్‌లో వర్షం కారణంగా తడిసిన ధాన్యం

దుబ్బాక : యార్డులో వర్షం నీటిలో కొట్టుకుపోయిన వడ్లను ఆరబెడుతున్న రైతులు

వడ్లకు తూకం వేయాలి..

ధాన్యం తూకం వేయకుండా ఆపడం ప్రభుత్వానికి సరికాదు. మేము పండించిన పం టంతా నేలపాలవుతున్నది. వర్షం రావడంతో ఆరబోసిన ధాన్యం మొత్తం కొట్టుకు పోతున్నది. పేరుకే కొనుగోలు కేంద్రాల పెట్టారు తప్ప కొనడం లేదు. ఉన్న ఆ కాస్త ధాన్యం కూడా ఎండకు ఆరబోస్తే ఉన్నదంతా కొట్టుకుపోయింది.

-సార్గు భాగ్యమ్మ, రైతు, రాయిలాపూర్, రామాయంపేట

పంటంతా నేలపాలు..

ఆరుగాలం కష్టపడి పండించినం వడ్లను ఆరబోస్తే ఉన్నదంతా కొట్టుకుపోయింది. ఇలాంటి బాధ ఏ రైతుకు కూడా రావద్దు.కొనుగోలు కేంద్రాలు పెట్టిన ప్రభుత్వ అధికారులు ఎందుకు తూకం వేయడం లేదు. ఆరబోసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలి. లేకుంటే మాకు నష్టాలు తప్పవు

-నర్సింహులు,రైతు, ఆర్.వెంకటాపూర్, రామాయంపేట

ప్రభుత్వమే ఆదుకోవాలి..

మా ధాన్యం మొత్తం వర్షానికి తడిసి ముద్దయ్యింది. చేతికి రాకుండా మొత్తం గింజలన్నీ కొట్టుకు పోయినయ్. ఏం చేయాలో అర్థం కావడం లేదు.ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ కనీసం టాపర్లు లేక ధాన్యం అంతా చేతికి రాకుండా పోయింది. రైతుబంధు రాక అట్ల నష్టపోయినం. ఇప్పుడు వడ్లు అమ్ముకుంటే పైసలు అస్తాయనుకుంటే ఇప్పుడు ఆ ఆశకూడా లేకుండా పోయింది.

-లక్ష్మి, మహిళా రైతు, రామాయంపేట

నర్సాపూర్‌లోని సొసైటీ కొనుగోలు కేంద్రంలో శుక్రవారం తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని నర్సాయపల్లి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం

వెల్దుర్తి కొనుగోలు కేంద్రం వద్ద నిలిచిన నీరు

రైతు కష్టం వర్షార్పణం

మెదక్ మార్కెట్‌లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళా రైతు

మెదక్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో గురు, శుక్రవారం వర్షం కురవడంతో మార్కెట్ యార్డులో విక్రయానికి తెచ్చిన ధాన్యం తడిసింది. దీంతో రైతులు ఆవేదన చెందారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కుప్పలుగా పోసిన ధాన్యం సైతం ఆకస్మిక వర్షానికి తడిసింది. మెదక్ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసి నీటిలో కొట్టుకుపోయింది. కష్టమంతా నీళ్లపాలు అయ్యిందని రైతులు బాధపడ్డారు. మార్కెట్ యార్డులో టార్పాలిన్లు సకాలంలో ఇవ్వలేదని కొందరు.. ఇప్పటికీ ఇంకా తూకం ప్రారంభంకాలేదని మరికొందరు రైతులు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో 497 కేంద్రాలను ఏర్పాటు చేసి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. పదిహేను రోజుల కిందటే జిల్లాలో 235 కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు మాత్రం ఊపందుకోవడం లేదు. జిల్లాలో మెదక్, చిన్నశంకరంపేట, నర్సాపూర్, రామాయంపేట, చేగుంట, హవేళీఘనపూర్, నిజాంపేట్, కౌడిపల్లి, కొల్చారం, చిలిపిచెడ్, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో వర్షం కురిసింది. కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షానికి వరి పంట నేల కొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వేల క్వింటాళ్లలో ధాన్యాన్ని రైతులు అమ్మేందుకు కొనుగోలు కేంద్రాలకు తెచ్చారు. భారీ వర్షం కురవడంతో ఆ ధాన్యం తడిసి ముద్దయ్యింది. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు రైతులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

మెదక్ మార్కెట్ యార్డులో వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

తెలంగాణ ఖ్యాతిని పెంచిన కేసీఆర్

- బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 1: అతి తక్కువ కాలంలో తెలంగాణను అన్నిరంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్ది దేశంలోనే ఖ్యాతిని తెచ్చిపెట్టిన ఘనత కేసీఆర్‌దే అని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఆనవాళ్లు, కనబడకుండా చేస్తామని రేవంత్‌రెడ్డి అనడం అతని తరం కాదన్నారు. నెంబర్ ఆలయంగా యాదాద్రి, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీళ్లు, మిషన్ కాకతీయ మరమ్మతులతో నిండుకుండలా చెరువులు, కుంటలు కనిపిస్తాయన్నారు. రైతుబంధు, 24గంటల ఉచిత కరెంట్, జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల నిర్మాణం, మోడల్ ఐవోసీ మార్కెట్‌లు, హరితహారంలో 285కోట్ల మొక్కలు నాటడం, సంక్షేమంలోనే దేశంలో తెలంగాణను నెంబర్ వన్‌గా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేసిన కేసీఆర్ గుర్తులను చేరిపేయడం కాంగ్రెస్‌కు సాధ్యం కాదన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌లను ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఆగిందని, సంక్షేమం అటకెక్కిందని, ఎక్కడా చూసిన ఉద్యోగుల ధర్నాలు, నిరుద్యోగులు, విద్యార్థులు రోడ్లెక్కుతుండగా.. ఆర్‌అండ్ ఆర్ కాలనీలో నిర్వాసితులు రోడ్లెక్కే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలోని 1.50కోట్ల మహిళలు ప్రభుత్వం తమకు ఎప్పుడు రూ.2500 ఇస్తదోనని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ కుదేలైందని, నేటికి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేకపోయారని, పండించిన పత్తిని రైతులు దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులే ధర్నాలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. త్వరలోనే రైతు గర్జన పేరుతో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. రూ.500 బోనస్ బోగస్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ. రాజమౌళి, వైస్ చైర్మన్ జకీమొద్దీన్, హజ్ కమిటీ మెంబర్ జాఫర్‌ఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండే మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు మెట్టయ్య, బాలమణి, కనకయ్య, అత్తెల్లి శ్రీనివాస్, అల్వాల బాలేశ్, మల్లేశం, నాయకులు దయాకర్‌రెడ్డి, నర్సింగరావు, ఆర్‌కే శ్రీను, ఉమర్, ఏల వెంకటేశం, అహ్మద్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే పక్కాగా పూర్తిచేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డిలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి, నవంబర్ 1 : ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి ఎన్యూమరేటర్లను సూచించారు. మండలంలోని ఇరిగిపల్లి, సంగారెడ్డి పట్టణంలోని 4వ వార్డు శివాజీ నగర్‌లో జరుగుతున్న ఇంటింటి సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమగ్ర సర్వే విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశా ల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు బ్లాక్‌ల వారీగా ఇండ్ల వివరాలను సిద్ధం చేసుకుని సర్వే చేపట్టాలన్నారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనర్‌ను ఆమె ఆదేశించారు. సర్వేకు అవసరమైన ఇంటి జాబితా, ఫారాలు, స్టిక్కర్లు కలెక్టరేట్‌లో తీసుకోవాలన్నారు. ఇంటి జాబితా ప్రక్రియను ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు పూర్తిచేసేలా తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి ఇంటికి ఎన్యూమరేటర్లు వెళ్లి నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు పక్కాగా నమోదు చేయాలని, సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్ అతికించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇరిగిపల్లి ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు తక్కువగా ఉండటంతో పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి ఖాసీవా బేగ్, తహసీల్దార్ దేవదాస్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, అధికారులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య

చిన్నశంకరంపేట, నవంబర్ 1 : అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మొల్ల మాసయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. వెంట నే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరణ చేపట్టకుంటే రైతులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

నలుగురు పోలీస్ సిబ్బంది సస్పెండ్

పటాన్‌చెరు, నవంబర్ 1 : గంజాయి స్మగ్లర్లతో సంబంధాలు నెరుపుతున్న ఇద్దరు ఎస్సైలు, ఒక హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్‌ను మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ సస్పెండ్ చేశారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఎస్సై అంబారియా , వీఆర్ ఎస్సై వినయ్‌కుమార్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ మారుతినాయక్, ఏఆర్ కానిస్టేబుల్ మధును ఐజీ శుక్రవారం సస్పెండ్ చేశారు. ఈ ఏడాది మేలో సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం సనత్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై అంబారియా, కానిస్టేబుల్ మధు ఓ వాహనాన్ని అడ్డుకుని 120 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో వాహనంతో పాటు నిందితుడిని వారు వదిలేశారు. మరో కేసులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాను నిజామాబాద్ జిల్లా వర్ని దగ్గర వీరు పట్టుకున్నారు. అక్కడి నుంచి వారిని నారాయణఖేడ్‌కు తీసుకుని వచ్చి 400 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనంతో సహా నేరస్తుడిని వదిలేశారు. ఈ రెండు ఘటనలపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి ఈ చర్యలు తీసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నేరస్తులను విచారించగా గంజాయి కేసుల్లో పోలీసుల చేతివాటం బయటపడింది. కొందరు పోలీసు సిబ్బంది చేస్తున్న ఇలాంటి పనులతో పోలీసుశాఖ ప్రతిష్టకు భంగం కలుగుతున్నదని ఐజీ సత్యనారాయణ అన్నారు. సంబంధిత పోలీసులపై ఎన్డీపీఎస్ యాక్ట్ కేసు నమోదుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని ఐజీ చెప్పారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

-రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌లో పటాకులు కాలుస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్, నవంబర్ 1: దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంతో పాటు స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో జరిగిన లక్ష్మీపూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి పటాకులు కాల్చి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లక్ష్మీ కటాక్షంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. రైతులు, వ్యాపారస్తులు, పరిశ్రమలకు ఎలాంటి ఆటంకం లేకుండా అమ్మవారి ఆశీర్వాదంతో ఆర్థికంగా ముం దుకు పోవాలన్నారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో ప్రజలను పలకరిస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఆటోలో, ద్విచక్రవాహనంపై పర్యటించి ప్రజలకు అభివాదం చేశారు. ఆయనతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పాల్గొన్నారు.